క్లుప్తంగా

ఇళ్లస్థలాలు కేటాయించాలని ధర్నా

ఏలేశ్వరం: పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ పట్టణంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై ధర్నాచేసి నిరసన తెలిపారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఏలేరు ప్రాజెక్టు మిగులు భూమి పేదలకు పంచాలని గతంలో హైకోర్టుకు ఆశ్రయించామన్నారు. హైకోర్టు స్థలాలు కేటాయించాలని ఆదేశాలు జారీ చేయగా గత ప్రభుత్వంలో పలువురికి ఇళ్ల స్థలాల పట్టాలు అందించామన్నారు. మిగిలిన పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అగ్రశ్రేణి కంపెనీల్లో శిక్షణకు ఆదిత్య విద్యార్థులు

గండేపల్లి: శిక్షణతో అగ్రశ్రేణి కంపెనీల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి విద్యార్థులనుద్దేశించి వ్యాఖ్యనించారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో గువి సంస్థతో కలిసి సీఎస్ఇ, ఐటి, ఈసీఇ శాఖల తుది సంవత్సరం విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు 781 మందికి తుది అంచనా పరీక్ష నిర్వహించగా వారిలో విజయవంతంగా పరీక్ష పూర్తిచేసిన 75 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి సోమవారం నుంచి యూనివర్సిటీ ప్రాంగణంలో 40 రోజులు ఆఫ్‌లైన్ శిక్షణ నిర్వహిస్తామన్నారు. పరిశ్రమలకు అనుగుణంగా ఉద్యోగానుకూల నైపుణ్యాలపై గువి నిపుణులచే శిక్షణ పొందుతారని ప్రో.వైస్ చాన్సలర్ ఆదిరెడ్డి రమేష్ వెల్లడించారు.

రుచికరమైన భోజనం అందించాలి

కిర్లంపూడి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు మధ్యాహ్న భోజన సిబ్బందికి ఎంఈఓ టి.జోసఫ్ పలు సూచనలు సూచించారు. సోమవారం స్థానిక కొక్కొండ రామశేషగిరి రావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలోని మండలంలో సిబ్బందికి వన్ డే శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా మిడ్-డే-మీల్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెను ప్రకారం ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ఆళ్ల బాబులు, హెచ్‌ఎం రమణికుమారి, ప్రకాశ రావు, డీఆర్‌పీలు గుడివాడ రాజ్యలక్ష్మీ, సిద్దార్థ, నాగమణి, ఎంఐఎస్ టి.శ్రీనివాస్, సీఆర్పీలు గోవిందు, బాబ్జీ తదితరులు ఉన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను సహించం

తుని: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మణిహారం, ఎంతోమంది యువకుల ప్రాణ త్యాగాల ఫలితంగా సాధించుకున్న స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని సీఐటీయూ కార్మిక నేత నక్కెళ్ల శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం తునిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 ఏళ్ల నుంచి స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేసే దుర్మార్గపు ఆలోచనలోనే ఉందన్నారు. రోజుకోమాట, పూటకోమాట మాట్లాడుతూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం గడిచినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించకోకపోతే కార్మికులు, ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్



కార్లు, ముద్దాయిలతో డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ శ్రీహరిబాబు

అన్నవరం: శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామ శివార్లలో గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6.65 లక్షలు విలువ చేసే 133.1 కేజీల గంజాయిని, రవాణా చేయడానికి ఉపయోగించిన మూడు కార్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.16,500 నగదు స్వాధీనం చేస్కున్నట్లు పెద్దాపురం డీఎస్పీ డీ శ్రీహరి రాజు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా జీ.మాడుగుల మండలం మగలూరు గ్రామానికి చెందిన పాంగి కృష్ణారావు, గడ్డరాయి గ్రామానికి చెందిన జగ్గందొర గోపాల్, సింగర్బ గ్రామంకు చెందిన గొల్లోరి మత్స్యరాజ్, ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేశారు. శంఖవరం మండలం నెల్లిపూడి శివారుకు కార్లలో తీసుకురాగా, వారి వద్ద నుంచి రాజమహేంద్రవరానికి చెందిన కోమలి రామకృష్ణ గంజాయి కొనుగోలు చేసి టయోటా గ్లాంజా కారులో తరలించే ప్రయత్నాల్లో ఉండగా పోలీసులు దాడి చేసి వారిని అరెస్ట్ చేశామన్నారు.

సమస్యల్లో సర్కారీ కాలేజీలు..!

- కళాశాలల నిర్వహణ ప్రశ్నార్థకమేనా?
- వసతుల లేమితో ఫలితాల్లో వెనుకబాటు
- నిర్వహణపై ప్రభుత్వం పెదవి విరుపు
- ఉత్తీర్ణత లేమితో ఆగమ్యగోచరంగా విద్యార్థుల భవిష్యత్



మూలగపూడిలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందివ్వాలనే ఉద్దేశ్యంతో మండలంలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలు నిర్వహణ ఈ ఏడాది ప్రశ్నార్థకంగా మారింది. కళాశాలలు ఏర్పాటు చేసినా కాని విద్యార్థుల అభ్యసనకు అవసరమైన అధ్యాపకులు, ల్యాబరేటరీ, భవనాలు, ఫర్నిచర్, ఇతర మౌళిక సదుపాయాలు లేక విద్యార్థులు లబోదిబోమంటున్నారు. దీంతో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలు మండలంలోని విద్యార్థులను, తల్లిదండ్రులను నిరాశపరిచాయి.

ప్రభుత్వం అందిచాలసిన అమ్మకు వందనం నేటికీ అందలేదు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ, నాణ్యమైన మధ్యాహ్నభోజనం వంటి పథకాలు అరకొరగా అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకునే ఆర్థిక స్థోమత లేక స్థానికంగా ఉన్న కళాశాలల్లో చదువునూ పూర్తిచేసి పై చదువులకు వెళ్దామన్న విద్యార్థుల భవిష్యత్ ఆగమ్య గోచరంగా మారిందంటు తల్లిదండ్రులు వాపోతున్నారు.

కళాశాలల పరిస్థితి

మండలంలోని పదవ తరగత పూర్తిచేసి పై చదువులకోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లి చదువుకునే ఆర్థిక స్థోమత లేక ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులకు 2022–23 విద్యాసంవత్సరం నుంచి మండలంలోని ములగపూడిలో మహిళా జూనియర్ కళాశాలను, 2024–25 విద్యా సంవత్సరం నుంచి మండల కేంద్రం రౌతులపూడిలో కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలను గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అప్పటి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చొరవతో ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు 40 సీట్లు చొప్పున కేటాయించి నిర్వహణ చేపట్టారు.

అధ్యాపకులు లేక అవస్థలు

మండలంలోని ములగపూడి మహిళా జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్రం, రసాయిన శాస్త్రంకు సంబంధిత అధ్యాపకులు లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రసాయినక శాస్త్రం బోధించేందుకు స్థానికంగా ప్రయివేటు అధ్యాపకురాలును ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకుని బోధన అందిస్తున్నారు. మండల కేంద్రం రౌతులపూడిలో గత ఏడాది ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ కళాశాలలో (ఎంపీసీ, బైపీసీ సబ్జెక్టులకు) అధ్యాపకులను నియమించకపోవటంతో స్థానిక జెడ్పీ హైస్కూల్లోని సంభందిత ఉపాధ్యాయులే అదనపు బాధ్యతలు తీసుకుని విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. ఈ రెండు కళాశాలలకు సంబంధించి ల్యాబరేటరీలు, వాటి నిర్వహణపై విద్యార్థులకు సరియైన అవగాహన లేక పరీక్షలలో తీవ్ర ఇబ్బందులు పడ్డామని వాపోయారు.



రౌతులపూడి జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు

కళాశాలల్లో ప్రత్యేక నిర్వహణ చేపడితే

మండలంలోని ఏర్పాటు చేసిన మహిళా జూనియర్ కళాశాల, కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్ బాషా అధ్యాపకులతో భౌతికశాస్త్రం, రసాయినశాస్త్రం, వృక్షశాస్త్రం, జీవశాస్త్రంకు అవసరమైన ప్రత్యేక అధ్యాపకులను ఏర్పాటు చేసి, ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ల్యాబరేటరీలు ఏర్పాటు చేస్తే స్థానికంగా చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో మెరుగైన విద్యను అభ్యసించేందుకు వీలుంటుందని సిబ్బంది కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన అన్ని రాయితీలను పూర్తిస్థాయిలో అందించాలి. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు మండలంలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలను పూర్తిస్థాయిలో నిర్వహణ చేపట్టి మెరుగైన, నాణ్యమైన విద్యానందివ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

స్థానిక ఉపాధ్యాయులతోనే బోధన

జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు గాని నేటికీ అధ్యాపకులను నియమించకపోవటంతో స్థానిక ఉపాధ్యాయులే అదనపు బాధ్యతలు చేపట్టి అభ్యసన చేపడుతున్నారు. ప్రత్యేక ల్యాబరేటరీలు లేక జెడ్పీ హైస్కూల్లోని ఉన్న ల్యాబరేటరీల్లోనే అభ్యసన కోనసాగించారు. దాని ఫలితంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలలో ములగపూడి మహిళా జూనియర్ కళాశాలలో ఇద్దరు, రౌతులపూడి జూనియర్ కళాశాలో 56 మంది విద్యార్థులకు కేవలం ఒక్కరు మాత్రమే ఉత్తీర్ణులవ్వటం కొసమెరుపు. ములగపూడి మహిళా జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 19మంది విద్యార్థులకు ఇద్దరు, ద్వితీయ సంవత్సరం 13మందికి ఒక్కరు చొప్పున విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ కళాశాలలున్నప్పటికీ సరియైన ఉత్తీర్ణతా శాతం రాకపోవటంతో ఈ ఏడాది విద్యార్థులు వేరే కళాశాలలకు తరలివెళ్లే పరిస్థితి నెలకొంది. వెంటనే పూర్తిస్థాయి అధ్యాపకులను నియమించి, ప్రత్యేక ల్యాబరేటరీ పరికరాలను ఏర్పాటు చేయాలి.

దార్లపూడి బార్గవి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రౌతులపూడి.

అరకొర బోధన

మహిళా కళాశాల ఏర్పాటు చేయటంతో మాలాంటి పేద విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని సంతోసించాం. కాని కళాశాలలో పూర్తిస్థాయి అధ్యాపకులను ఏర్పాటు చేయకుండా పీజీటీలను నియమించి కొన్ని సబ్జెక్టులకు మాత్రమే బోధన అందిస్తున్నారు. భౌతికశాస్త్రం, రసాయినశాస్త్రం వంటి ప్రధాన సబ్జెక్టులను నాణ్యతతో బోధించేందుకు నేటికి ఎలాంటి అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించి, అవసరమైన అభ్యసనా పరికరాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.

తానార యశోధ, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, మహిళా జూనియర్ కళాశాల ములగపూడి.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే మరిన్ని ఫలితాలు

మండలంలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలకు అధ్యాపకులు లేకపోవటంతో పాఠశాలలోని ఉపాధ్యాయులే అదనపు బాధ్యతలు చేపట్టి విద్యార్థులకు బోధన అందిస్తున్నాం. ప్రత్యేక ల్యాబరేటరీలు లేక పాఠశాలలో ఉన్న పాత పరికరాలను ఉపయోగించి ల్యాబ్‌బోధన కూడ అందిస్తున్నాం. ప్రత్యేక అధ్యాపకులను ఏర్పాటు చేసి, విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందించి మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించడానికి వీలుంటుంది.

కోళ్ల రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, రౌతులపూడి

సజ్జల రామకృష్ణా రెడ్డిని కలిసిన రాంజీ



తాడేపల్లిల్లో సజ్జల రామకృష్ణరెడ్డిని కలిసిన తోట రాంజీ

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణా రెడ్డిని తాడేపల్లి వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యువతను కలుపుకుని కూటమి వైఫల్యాలపై పోరాడుతామని ఆయనకు సూచించారు. సమావేశంలో ఆయనతో పలువురు నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

కారు- లారీ ఢీ



తుమ్మయ్య పేటలో కారును ఢీ కొట్టిన లారీ

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు తమ్మయ్యపేట జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణీకులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖకు చెందిన నలుగురు వ్యక్తులు విజయవాడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వారి కారు తమ్మయ్యపేటకు చేరుకునే సరికి వెనుక వస్తున్న లారీ కారుని వేగంగా ఢీ కొట్టడంతో ఒక్కసారిగా రహదారిపై అడ్డంగా కారు తిరిగి ఆగిపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడగా ప్రాణాపాయం తప్పిందని వారు తెలిపారు. ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై జగన్మోహన్‌రావు పేర్కొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



ఎస్.అన్నవరంలో యోగాంధ్రపై బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మండల పరిషత్ ఉద్యోగులు

రౌతులపూడి: రోజు ఒక గంట యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కల్గుతుందని ఎంపీడీఓ బి.శివరామకృష్ణయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సిబ్బందితో కలసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగా చేపట్టడం ద్వారా మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ప్రజలను చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కర్, పైల వేణు, ఏపీఎం నాగమణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రపై బైక్ ర్యాలీ

తుని రూరల్: యోగా చేయడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ మండల పరిషత్ అధికారులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తుని మండలం ఎస్.అన్నవరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాని భాగం చేయాలన్నారు. శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి గ్రామం మొయిన్‌రోడ్డు శివారు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కె.సాయిన వీన్, డిప్యూటీ ఎంపీడీఓ జి.మరిడియ్య, కార్యదర్శి వీరలక్ష్మి, ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: విశాఖలో ఈనెల 21న జరుగనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనే యోగా డేలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఔత్సాహకులు పాల్గొనాలని ఆమె కోరారు. «యోగాంధ్రా»ను పురస్కరించుకుని మండలంలోని ఒమ్మంగి గ్రామంలో సోమవారం యోగాంధ్రా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించి ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు యోగాపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. యోగాంధ్రా మాసోత్సవాల్లో ప్రజలు పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామం వంటివి సాధన చేసి, ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతారామం, సాగర్ ప్రాజెక్టు నీటి సంఘం చైర్‌పర్సన్ ఇళ్ళ అప్పారావు, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, తహసీల్దార్ ఎం సూర్యప్రభ, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



ఒమ్మంగి గ్రామంలో ర్యాలీని ప్రారంభించి, ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

యోగాతో మెరుగైన ఆరోగ్యం

తుని: యోగా చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని మున్సిపల్ చైర్మన్ నార్ల భువనసుందరి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బాలాజీ సెంటర్ వరకూ యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అర్థమయ్యేలా నినాదాలు చేపట్టారు. పట్టణ ప్రజలంతా ప్రభుత్వం నిర్వహించే యోగాంధ్రాలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేతలు మెప్మా సిబ్బంది, యోగా టీచర్లు పాల్గొన్నారు.

ప్రచారంపై శ్రద్ధ.. అమలులో లేదు

ఏలేశ్వరం: యోగాంధ్రపై అవగాహనలో భాగంగా పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. నగరపంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ కోనసాగింది. తొలుత స్థానిక శివాలయం ఎదురుగా పిరమిడ్ కేంద్రంలో యోగాగురువు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు యోగాసనాలు వేయగా వాటిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చాన్నారు. ప్రతిరోజూ యోగా చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.సత్యనారాయణ ఉద్యోగులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ నిర్లక్ష్యం

యోగాంధ్రపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా దానిని పాటించడంలో నగరపంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కేవలం మీడియా ప్రచారంపై ఉన్న శ్రద్ధ ప్రజలకు అవగాహన కల్పించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నగర పంచాయతీ అధికారులు ఏ కార్యక్రమైనా తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఏలేశ్వరంలో యోగాంధ్రపై ర్యాలీ చేస్తున్న నగర పంచాయతీ సిబ్బంది

మీడియా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి

కిర్లంపూడి: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసను అరెస్ట్ చేయడాన్ని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తీవ్రంగా ఖండించారు. సాక్షి ఛానల్‌లోని రాజధాని అంశంపై జరుగుతున్న కొమ్మినేని శ్రీనివాస్ లైవ్ ప్రోగ్రాంలో పాల్గొన్న కృష్ణరాజు వాడిన భాషను కొమ్మినేని ఖండించి క్షమపణలు చెప్పరన్నారు. మరుసటి రోజు కూడా లైవ్‌లో క్షమాపణలు చెప్పినా కూటమి ప్రభుత్వం ఆయనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. అందులో భాగంగానే కృష్ణంరాజు వాడిన భాషను ఆధారంగా తీసుకుని దానికి పర్యాయర్థాలు జోడించి మరో అర్థం వచ్చేలా మహిళలను వక్రీకరించినట్లు కొమ్మినేని శ్రీనివాస్‌తో పాటు సాక్షి ఛానల్‌ను, యాజమాన్యాన్ని బాధ్యులను చేస్తూ క్రిమినల్ కేసులు ఆపాదించి ఆయనను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మీడియాకు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని దయ్యాబట్టారు.



ముద్రగడ గిరిబాబు

షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం



షైనింగ్ స్టార్స్ అవార్డులు స్వీకరించిన అనంతరం విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రమేష్

ప్రత్తిపాడు: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి షైనింగ్ స్టార్స్ – 2025 అవార్డులను సోమవారం అందించారు. కాకినాడ బాలాజీ చెరువు కూడలి వద్ద టీటీడీ కల్యాణ మండపంలో ఈ అవార్డుల ప్రదానం కార్యక్రమం జరిగింది. మండలంలోని ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్, ప్రత్తిపాడు మినర్వా విద్యార్థులు అవార్డులను అందుకున్నారు. ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్ పదో తరగతి విద్యార్థిని పల్లాటి లాస్య మనస్విని 588 మార్కులతో మండలం ఫస్ట్ సాధించింది. 583 మార్కులతో తృతీయ స్థానం లభించిన గొర్ల దుర్గా వైష్ణవిలు జిల్లా ఇన్‌చార్జ్, పురపాలక శాఖ మంత్రి పొంగులేటి నారాయణ, కలెక్టర్‌ల సమక్షంలో అవార్డును అందుకున్నట్లు కరస్పాండెంట్ సుంకర వీరబాబు తెలిపారు. కాగా ప్రత్తిపాడు మినర్వా స్కూల్‌కు చెందిన వేముల శరణ్య పదో తరగతిలో 583 మార్కులు సాధించగా అవార్డు అందుకున్నట్టు మినర్వా ప్రిన్సిపాల్ సీహెచ్ ఆనందకుమార్ జోషి తెలిపారు.

జగ్గంపేట విద్యార్థికి అవార్డు ప్రదానం

జగ్గంపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డును జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సెకండీయర్ హెచ్ఈసీ విద్యార్థి నాగలక్ష్మణ్ అందుకున్నట్టు ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కాకినాడ టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో కలెక్టర్ చేతుల మీదుగా నాగలక్ష్మణ్ షైనింగ్ స్టార్ అవార్డు, ప్రశంస పత్రం, రూ.20 వేలు అందుకున్నాడని పేర్కొన్నారు.



మంత్రి నారాయణ, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ర్యాంకర్ లాస్య మనస్విని

అవార్డులు అందుకున్న విద్యార్థినులు

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూలు చెందిన ఇద్దరు విద్యార్థినులు షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. 581 మార్కులు సాధించిన లంక పూర్ణిమ, కీర్తి దుర్గానందినిలు సోమవారం కాకినాడలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు అవార్డుల ప్రదానం

తొండంగి: షైనింగ్ స్టార్స్ అవార్డులను మండలంలోని ఏ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు అందుకున్నట్లు పాఠశాల హెచ్.ఎమ్. ఏ.లక్ష్మీమాణిక్యం తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థులు తొగర పావనీ షణ్ముఖీ, వి.దివ్య, ఏ.యశ్వంత్‌లు అవార్డులు ప్రశంసాపత్రాలు, అందుకున్నారన్నారు.

నేరాల నియంత్రణకు సహకరించండి

తుని రూరల్: పెరిగిన టెక్నాలజీ దృష్ట్యా నేరాలను అదుపు చేసేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవ రావు అన్నారు. సోమవారం తుని మండలం లోవ కొత్తూరులో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలు మేరకు జూదం, బెట్టింగ్, రోడ్డు ప్రమాదాలు, వివిధ నేరాలు నివారణపై గ్రామస్తులకు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అనేక రూపాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. యువత జాగ్రత్తగా ఉండాలని బెట్టింగులు, జూదాలు, ఆన్‌లైన్ జూదాలు, డ్రగ్స్, దొంగతనాల జోలికి వెళ్లొద్దన్నారు. మోసపోయిన తర్వాత బాధపడేకంటే ముందుగానే మేల్కొనాలన్నారు. నేరాలకు పాల్పడేవారిపై పోలీసులు నిఘా ఉంచారన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినా, నేరాలపై ముందస్తు సమాచారం ఉన్నా గ్రామస్తులు, యువకులు పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.



లోవకొత్తూరులో నేరాల నియంత్రణ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ చెన్నకేశవరావు

లోవలో అసాంఘిక కార్యకలపాలపై ఉక్కుపాదం

ఆషాడమాసం సందర్భంగా తలుపులమ్మ అమ్మవారి లోవదేవస్థానంలో జరిగే ఉత్సవాల్లో జూదాలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సీసీ కెమెరాలు, శక్తియాప్‌పై పనితీరుపై వివరించారు. ట్రైనీ డీఎస్పీ సీహెచ్.జీవన, రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి, నాయకులు పాల్గొన్నారు.

తోట నరసింహం పరామర్శలు

గండేపల్లి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సోమవారం పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రజలను పరామర్శించారు. మండలంలోని నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్ సోదరుడు కృష్ణ, గ్రామానికి చెందిన అడబాల ప్రసాద్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, పార్టీ నేతలు ఉన్నారు. జగ్గంపేట మండలం రామవరంలో ఇటీవల మరణించిన రావుల కొండలరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటంబ సభ్యులకు సూచించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు గౌరవం

కిర్లంపూడి: ఉత్తమ సేవలకు అపూర్వ గౌరవం దక్కుతుందని సీనియర్ పాత్రికేయుల కొనియాడారు. కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో గత 6 ఏళ్లగా రైటర్‌గా విధులు నిర్వహించి బదిలీపై కోరింగ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్న నాగళ్ల వెంకటరమణను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం పూలమాలతో సత్కరించారు. సీనియర్ పాత్రికేయులు కృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలతో ఇబ్బందులు

శంఖవరం: మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా పర్యావరణాన్ని ఖూనీ చేస్తు గ్రావెల్ వంటి అక్రమ రవాణతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సామాజిక కార్యకర్త మేకల కృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ తాతారావులకు సమస్యపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌతులపూడి మండలం చల్లూరు, గుమ్మరేగుల, ఎస్.పైడిపాల నుంచి అనుమతులు లేకుండా నల్లరాయి, ఎర్రమట్టి లాటిరైట్), గ్రావెల్ విచ్చలవిడిగా ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారన్నారు. అధిక లోడుతో లారీలు తిరగడంతో రౌతులపూడి, బంగారయ్యపేట, శృంగవరం, శంఖవరం, నెల్లిపూడి, కత్తిపూడి తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనుమతులు లేకుండా నిత్యం రవాణా జరుగుతుందని, వాటి వల్ల రహదారి భారీ గోతులతో అధ్వానంగా మారిపోతుందన్నారు. చిన్న పిల్లలు, విద్యార్థులు, వృద్ధులు వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గొర్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి వెన్నులో వణుకు



న్యాయవాది గుల్లా ఏడుకొండలు (ఫైల్)

గోకవరం: సాక్షి టివి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్ రాజాధాని అంశంపై లైవ్ నిర్వహిస్తున్న కార్యక్రమంలో మరో జర్నలిస్టు కృష్ణంరాజు వాడిన అనాలోచిత భాషను ఆధారంగా తీసుకుని ఆయనను అరెస్టు చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్, న్యాయవాది గుల్లా ఏడుకొండలు సోమవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. లైవ్ కార్యక్రమంలో కృష్ణంరాజు వాడిన ఆ పదజాలాన్ని వెంటనే ఉపసంహరించుకోమని అది వేరే విమర్శకు దారితీస్తుందని వెంటనే కొమ్మినేని ఖండించారన్నారు. ఈ సంఘటనను పచ్చ మీడియా అనుకూలంగా మార్చుకుని మహిళలను కించపరిచినట్లు చిత్రీకరించి కొమ్మినేనేని అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వ అహంకారాన్ని రుజువు చేస్తుందని ఆరోపించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం విజయవంతం కావడంతో ప్రభుత్వం వెన్నులో చలి పుట్టించిందన్నారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ఈ సంఘటనను వక్రీకరించి అక్రమ అరెస్టులకు పాల్పడుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తప్పుడు అరెస్టులు మానుకోవాలని, చట్టాలను గౌరవించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.